# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TGTEL/25/A0871 TELANGANAVENNELA WAKKU
విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :70 | 26-09- 2026 | శనివారం | పేజీలు: 4 | వెల:03/-


# సీఎం రేవంత్‌కు ‘ఆర్యదాన్ ముహమ్మద్-2026’ అవార్డు

## ఉత్తమ ప్రజా సేవకుడిగా ఎంపిక.. నేడు కేరళలోని నిలంబూర్‌లో ప్రదానం



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్’ అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలు, నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏపీ అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి

మిగతా వివరాలు రెండో పేజీలో..

# ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక విభాగం.. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రమాద స్పందన అధికారి

హైదరాబాద్: రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ నియంత్రణను కేవలం జరిమానాలు విధించడం, వసూలు చేయడానికే పరిమితం చేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో రాకపోకలను నియంత్రించడం, ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించడం లక్ష్యంగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలో తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రహదారి, రైలు భద్రతా విభాగాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈ విభాగానికి అదనపు పోలీసు మహానిర్దేశకుడు లేదా పోలీసు మహానిరీక్షకుడి స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్లకు పైగా ఉన్న రహదారులు, కోటి 80 లక్షలకు పైగా వాహనాల రాకపోకలను ఈ విభాగం పర్యవేక్షించనుంది. రోడ్డు రవాణాతో పాటు మెట్రో రైలు, రైల్వే భద్రతకు సంబంధించిన అంశాలను కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రమాదాల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ప్రమాద స్పందన అధికారిని నియమించనున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను అత్యవసర వైద్యం



అందించే ఆసుపత్రికి తరలించడం, ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే చికిత్స అందేలా చర్యలు తీసుకోవడం

మిగతా వివరాలు రెండో పేజీలో..

# హైదరాబాద్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

- గంగమ్మ ఒడికి బడా గణేశుడు..
- భక్తజన సందోహంతో మార్మోగిన మహానగరం
- 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతికి ఘన వీడ్కోలు
- ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పోటెత్తిన భక్తులు..
- గణపతి బప్పా మోరియా’ నినాదాలతో మార్మోగిన నగరం
-పటిష్ఠ బందోబస్తు మధ్య ప్రశాంతంగా కొనసాగిన నిమజ్జనోత్సవం



మిగతా వివరాలు రెండో పేజీలో..

## బాలాపూర్ లడ్డూకు బంగారు ధర!

రూ.39.01 లక్షలకు దక్కించుకున్న అర్బన్ గ్రూప్ అధినేత సామ ప్రణీత్ రెడ్డి
భారీ ధర పలికిన గణేశుడి లడ్డూ.. ఆసక్తిగా తిలకించిన భక్తులు



హైదరాబాద్: బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం నిర్వహించిన వేలంలో బాలాపూర్ లడ్డూ ఏకంగా రూ.39.01 లక్షల

మిగతా వివరాలు రెండో పేజీలో..

## బ్యాంకుల సమ్మె.. ఎస్‌బీఐ కీలక ప్రకటన

సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు ఏటీఎం ఛార్జీలు మినహాయింపు
దేశవ్యాప్తంగా బ్యాంకు సమ్మె నేపథ్యంలో ఖాతాదారులకు ఊరట
ముఖ్యమైన బ్యాంకింగ్ పనులు ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచన




మిగతా వివరాలు 3వ పేజీలో..

## గోదావరిలో వరద.. రిజర్వాయర్లు ఖాళీ!

- గోదావరి జలాలను తక్షణమే ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపాలి
- ఎల్లంపల్లి వద్ద మోటార్లు నడపకపోవడం ప్రభుత్వ వైఫల్యమే: హరీశ్‌రావు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి



మిగతా వివరాలు 3వ పేజీలో..

## సీఈసీ రాజీనామా చేయాలి

- ఓట్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం.. అభిశంసనకు మద్దతు కూడగడతాం
- ఓటర్ల హక్కులను కాపాడాలి..
- ఎన్నికల సంఘంపై కఠిన చర్యలు తీసుకోవాలి: మహేష్‌కుమార్ గౌడ్



మిగతా వివరాలు 3వ పేజీలో..

## అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

- సాహితి ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో విచారణకు పిలుపు
- సెప్టెంబర్ 27న హైదరాబాద్ ఈడీ కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశం
- ఎమ్మెల్యే ఖాతాల్లోకి రూ.2.1 కోట్ల బదిలీపై ఆరా



మిగతా వివరాలు 3వ పేజీలో..

# దేవుడి ముందు చేతులు ఎందుకు జోడిస్తాం..

## ఆ రెండు చేతుల వెనుక ఇంత అర్థమా?



దేవాలయంలోకి వెళ్లగానే చాలామంది ముందుగా చేసే పని చేతులు జోడించి దేవుడికి నమస్కరించడం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎవరి పద్ధతి వారిదైనా.. దేవుడి ముందు రెండు చేతులు కలవడం మాత్రం అందరిలోనూ కనిపించే సాధారణ దృశ్యం. అయితే చేతులు జోడించడం కేవలం నమస్కారం చెప్పడానికేనా? దాని వెనుక ఒక అందమైన ఆధ్యాత్మిక భావన దాగి ఉంది.మనిషిలో ఆలోచనలు, భావాలు, కోరికలు, అహంకారం అన్నీ వేర్వేరు దారుల్లో నడుస్తుంటాయి. దేవుడి ముందు రెండు చేతులు కలపడం అంటే.. మనలోని భిన్నమైన భావాలను ఒకచోట చేర్చి, మనసును ఏకాగ్రం చేసుకోవడం అనే భావనను గుర్తు చేస్తుంది. ఒక చేయి మన కృషికి, మరో చేయి దైవంపై నమ్మకానికి ప్రతీకగా భావిస్తే.. రెండూ కలిసినప్పుడు జీవితంలో శ్రమతో పాటు విశ్వాసం కూడా అవసరమని గుర్తుచేస్తాయి.చేతులు జోడించినప్పుడు మనిషి తనకంటే గొప్పదైన శక్తి ముందు తాను వినయంగా నిలబడుతున్నాననే భావన కలుగుతుంది. సంపద ఉన్నా, అధికారం ఉన్నా, ఎంత గొప్ప స్థాయిలో ఉన్నా.. దేవుడి ముందు అందరూ ఒకే భక్తులు. అందుకే నమస్కారం మనిషిలోని అహంకారాన్ని తగ్గించి వినయాన్ని పెంచే ఒక సాధనగా మారుతుంది.అయితే చేతులు జోడించడం మాత్రమే భక్తి కాదు. చేతులు దేవుడి ముందు కలిసినా.. మనసు మాత్రం మరెక్కడో ఉంటే ఆ నమస్కారానికి అర్థం తగ్గిపోతుంది. నిజమైన నమస్కారం అంటే శరీరం వంగడం కంటే ముందుగా మనసు వంగడం. దేవుడి ముందు చేతులు జోడించిన ఆ కొన్ని క్షణాల్లో మన కోపాన్ని, ద్వేషాన్ని, అహంకారాన్ని పక్కన పెట్టగలిగితే అదే అసలైన ప్రార్థన.అందుకే ఇక నుంచి దేవుడి ముందు చేతులు జోడించిన ప్రతిసారీ ఒకసారి మనల్ని మనమే ప్రశ్నించుకుందాం.. "నా చేతులు మాత్రమే కలిశాయా.. నా మనసు కూడా దేవుడితో కలిసిందా?" అని. ఆ ఒక్క ఆలోచన మన ప్రార్థనను మరింత అర్థవంతం చేస్తుంది.దేవుడి ముందు జోడించిన చేతులు కేవలం రెండు అరచేతులు కావు.. మనిషి తనలోని అహంకారాన్ని దించి, వినయాన్ని ఎత్తుకునే క్షణానికి అవి గుర్తు. దేవుడిని వేడుకునే ముందు.. మనసును మార్చుకోవాలనే సంకల్పం చేస్తే, అదే నమస్కారానికి అసలైన అర్థం.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## సీఎం రేవంత్‌కు 'ఆర్యదాన్ ముహమ్మద్-2026' అవార్డు

కల్పెట్టా నారాయణన్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్‌రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ ప్రస్తావించినట్లు ఫౌండేషన్ తెలిపింది. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు.

ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నిలంబూర్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.

ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ అసెంబ్లీకి ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. ఆయన ప్రజాసేవను గుర్తు చేసుకుంటూ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది.

## ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఆయన ప్రధాన బాధ్యతగా ఉంటుంది.

ఔటర్ రింగ్ రోడ్డు, 50 కిలోమీటర్లకు పైగా ఉన్న ప్రధాన రహదారులపై ప్రత్యేక రహదారి గస్తీ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. వేగాన్ని గుర్తించే పరికరాలు, ఆధునిక నిఘా కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు.

ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రత్యేక నిధిని కూడా ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే వాహన జరిమానాల మొత్తంలో 40 శాతం ఈ నిధికి మళ్లించనున్నారు. ఈ నిధులను పోలీసు సిబ్బంది శిక్షణ, ఆధునిక సాంకేతిక పరికరాలు, గస్తీ వాహనాలు, రహదారుల అత్యవసర మరమ్మతులు, రోడ్డు భద్రతా చర్యలకు వినియోగించనున్నారు.

కొత్త వ్యవస్థ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత, ప్రమాదాల నివారణ, ప్రమాద బాధితులకు సత్వర సహాయం వంటి అంశాలను సమన్వయంతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సురక్షితమైన రహదారి ప్రయాణానికి అవసరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# పామాయిల్ రైతు నెత్తిన సుంకం తగ్గింపు పిడుగు

- పాక్ పట్లలో పామాయిల్ ప్రాజెక్టుపై నెరవేరని హామీ..
- బిజెపి ఎమ్మెల్యే తీరుపై రైతుల ఆగ్రహం





నిర్మల్ సెప్టెంబర్ 24: ఇప్పుడిప్పుడే బాలారిష్టాలు దాటి లాభాల బాటపడుతున్న పామాయిల్ రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర షాక్‌కు గురిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా క్రూడ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుంచి 11 శాతం (అనగా 5.5 శాతం) తగ్గించడంతో పామాయిల్ రైతులకు భారీ నష్టం వాటిల్లనుంది. గతంలో క్రూడ్ ఆయిల్ దిగుమతి సుంకం పెరగడంతో టన్నుకు రూ. 24,000 వరకు ధర పలికి రైతులు లాభాల బాటలో పయనించారు. అయితే ఇప్పుడు ఏకంగా 5.5 శాతం దిగుమతి సుంకం తగ్గించడంతో ఫ్రూట్ ధర టన్నుకు రూ. 2,000 వరకు తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

**దిగుమతి సుంకం పెంపుపై మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

ఈ పరిణామాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని తాము మొదటి నుంచీ డిమాండ్ చేస్తుంటే, ఉన్నదాంట్లోనే 5.5 శాతం తగ్గించడం రైతుల మెడకు గుడిబండలా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న పామాయిల్ సాగుపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇప్పటికే కోట్లలో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలంటే కేంద్రం తక్షణమే స్పందించి దిగుమతి సుంకాలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.



**నిర్మల్ జిల్లాలో నిలిచిపోయిన ఆయిల్ ప్రాజెక్టు**

ఒకవైపు కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ధరలు పడిపోయే ప్రమాదం ఉండగా, మరోవైపు నిర్మల్ జిల్లా స్థానిక పరిస్థితులు పామాయిల్ రైతులను మరింత కుంగదీస్తున్నాయి. నిర్మల్ జిల్లాలో దాదాపు 15,000 ఎకరాలకు పైగా రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారు. సోన్ మండలంలోని పాక్ పట్ల గ్రామంలో పామాయిల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికీ, ఆ ప్రాజెక్టును ఎవరు అడ్డుకున్నారనే దానిపై ఇప్పుడు రైతుల్లో తీవ్ర చర్చ మొదలైంది.

**ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్న రైతులు**

శాసనసభ్యుడిగా (ఎమ్మెల్యే) గెలిచి మూడు సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటివరకు పామాయిల్ ఇండస్ట్రీ ఏర్పాటుపై నోరు మెదపకపోవడం పట్ల బిజెపి ఎమ్మెల్యేపై స్థానిక రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్ ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే తన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని, పామాయిల్ పరిశ్రమ అభివృద్ధిపై ఏమాత్రం పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు.

ఓవైపు మద్దతు ధరల కోత, మరోవైపు జిల్లాలో ప్రాసెస్ చేసే ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాకపోవడంతో నిర్మల్ జిల్లా పామాయిల్ రైతులు తీవ్ర నష్టాల సుడిగుండంలో చిక్కుకున్నామని వాపోతున్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

హైదరాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం హైదరాబాద్ మహానగరంలో ఘనంగా ముగింపు పలికారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన శోభాయాత్రలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ప్రధానంగా ఖైరతాబాద్ బడా గణేశుడి నిమజ్జనాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్ పరిసరాలకు తరలివచ్చారు. భక్తుల జయజయధ్వానాలు, గణపతి బప్పా మోరియా నినాదాలతో హైదరాబాద్ నగరం మార్మోగింది.ఖైరతాబాద్‌లో ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతిగా కొలువుదీరిన బడా గణేశుడి శోభాయాత్ర ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైంది. ఖైరతాబాద్ నుంచి సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మార్గమంతా భక్తులు భారీగా తరలివచ్చి గణనాథుడికి వీడ్కోలు పలికారు.ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ క్రేన్ల సహాయంతో బడా గణేశుడిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జన ప్రక్రియ పూర్తయింది. బడా గణేశుడి చివరి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ట్యాంక్‌బండ్ పరిసరాలు కిక్కిరిశాయి.నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరిన వినాయక విగ్రహాల శోభాయాత్రలు ప్రధాన నిమజ్జన ప్రాంతాలకు చేరుకున్నాయి. డప్పుల మోతలు, భక్తి గీతాలు, నృత్యాలతో పలుచోట్ల సందడి నెలకొంది. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో శోభాయాత్రల్లో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ, నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులకు భక్తులు కన్నీటి వీడ్కోలు పలుకుతూ 'వచ్చే ఏడాది త్వరగా రావాలి' అంటూ ఆకాంక్షించారు. నిమజ్జనోత్సవంతో హైదరాబాద్‌లో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి.

## బాలాపూర్ లడ్డూకు బంగారు ధర!



ధర పలికింది. అర్బన్ గ్రూప్ అధినేత సామా ప్రణీత్ రెడ్డి ఈ లడ్డూను సొంతం చేసుకున్నారు. భారీ ధరకు లడ్డూ దక్కించుకోవడంతో బాలాపూర్‌లో సందడి నెలకొంది.బాలాపూర్ గణేశ్ ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రతిఏటా ప్రత్యేకతను సంతరించుకుంది. గణనాథుడికి సమర్పించిన లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు, వ్యాపారవేత్తలు ఆసక్తి చూపుతుంటారు. ఈసారి కూడా వేలం ప్రక్రియను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వేలం కొనసాగుతున్న కొద్దీ పోటీ పెరిగి చివరకు రూ.39.01 లక్షల వద్ద నిలిచింది.లడ్డూను దక్కించుకున్న సామా ప్రణీత్ రెడ్డికి నిర్వాహకులు అభినందనలు తెలిపారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను సొంతం చేసుకోవడం శుభప్రదంగా భావించే నేపథ్యంలో ఈ వేలానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. భారీ ధర పలకడంతో బాలాపూర్ లడ్డూ వేలం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# బ్యాంకుల సమ్మె.. ఎస్‌బీఐ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు ప్రతిపాదిత దేశవ్యాప్త బ్యాంకు సమ్మె నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఖాతాదారులకు కీలక ప్రకటన చేసింది. ఈ మూడు రోజుల్లో ఏటీఎంల ద్వారా నిర్వహించే లావాదేవీలపై వర్తించే ఏటీఎం ఛార్జీలను మినహాయిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. దేశంలోని ఏ బ్యాంకు ఏటీఎంలో లావాదేవీ చేసినా ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది.బ్యాంకు ఉద్యోగ సంఘాల సమాఖ్య సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు వారాంతపు సెలవులు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖల సాధారణ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముఖ్యమైన శాఖా సంబంధిత పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఎస్‌బీఐ సూచించింది.

ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇతర డిజిటల్ సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవచ్చని బ్యాంకు సూచించింది. కాగా కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 27 ఆదివారం కూడా అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల శాఖలు పనిచేసేలా చర్యలు తీసుకుంది.అయితే ఏటీఎం ఛార్జీల మినహాయింపుకు సంబంధించిన నిబంధనలు, ఖాతా రకం తదితర అంశాలపై ఖాతాదారులు ఎస్‌బీఐ తాజా అధికారిక సమాచారాన్ని పరిశీలించడం మంచిది.

# గోదావరిలో వరద.. రిజర్వాయర్లు ఖాళీ!

హైదరాబాద్: గోదావరిలో వరద ప్రవాహం ఉన్నప్పటికీ రిజర్వాయర్లను నింపేందుకు నీటిని ఎత్తిపోసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి జలాలను తక్షణమే ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని కోరుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు ఆయన తన సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించారు.

ఎల్లంపల్లి వద్ద భారీగా గోదావరి వరద ప్రవాహం ఉన్నప్పటికీ మోటార్లు నడిపి నీటిని ఎత్తిపోకపోవడం ప్రభుత్వ వైఫల్యమని హరీశ్‌రావు ఆరోపించారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి చేరాయని, 50 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్లన్న సాగర్‌లో కేవలం 13 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఎల్ఎండీలో 11 టీఎంసీల నీరు ఉందని ఆయన పేర్కొన్నారు.

రంగనాయక సాగర్‌లో నీటి లభ్యత తగ్గడంతో సిద్దిపేట నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎల్‌నినో కారణాలను చూపకుండా అందుబాటులో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.

మిడ్‌మానేరు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ సహా అన్ని రిజర్వాయర్లను నింపేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. 24 గంటల పాటు అన్ని మోటార్లను నడిపి గోదావరి జలాలను ఎత్తిపోసి రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సీఈసీ రాజీనామా చేయాలి

హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃపరిశీలన ప్రక్రియపై టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీపై అభిశంసనకు మద్దతు కూడగడుతున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది.ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిపోతున్నాయని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పలుమార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వారి పేర్లు సైతం తొలగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా పునఃపరిశీలనలో పారదర్శకత పాటించాలని, తొలగించిన ఓట్లకు సంబంధించిన వివరాలు, కారణాలను వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.ఇదిలా ఉండగా, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన తీర్మానం కోసం ప్రతిపక్ష పార్టీలు మద్దతు కూడగడుతున్నట్లు జాతీయ స్థాయిలో వార్తలు వెలువడ్డాయి. ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు చట్టబద్ధమైన ప్రక్రియలోనే తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది.

# అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

హైదరాబాద్: సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.సాహితి ఇన్‌ఫ్రా సంస్థ నుంచి ఎమ్మెల్యే బ్యాంకు ఖాతాలకు సుమారు రూ.2.1 కోట్లు బదిలీ అయినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు ఈడీ పేర్కొన్నట్లు సమాచారం. ఈ మొత్తానికి సంబంధించిన లావాదేవీల స్వభావం, ఉద్దేశం ఏమిటనే అంశాలపై అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ లావాదేవీలకు సాహితి ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ వ్యవహారంతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతున్నట్లు నివేదిక పేర్కొంది.సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు, విల్లాలు నిర్మిస్తామని చెప్పి కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి, ప్రాజెక్టులు పూర్తి చేయలేదనే ఆరోపణలపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టింది. మొదట సుమారు రూ.248 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు కేసులు నమోదుకాగా, తదుపరి దర్యాప్తులో మొత్తం వ్యవహారం విలువ సుమారు రూ.842 కోట్లకు చేరినట్లు ఈడీ అంచనా వేసినట్లు తాజా కథనం పేర్కొంది.ఈ కేసులో సాహితి ఇన్‌ఫ్రా సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతో పాటు, గతంలో ఆస్తులను కూడా ఈడీ జప్తు చేసినట్లు సమాచారం. సంస్థ ఎండీ బి.లక్ష్మీనారాయణను 2024 సెప్టెంబర్‌లో ఈడీ అరెస్టు చేసినట్లు నివేదిక పేర్కొంది. కేసు దర్యాప్తులో భాగంగా సంస్థకు సంబంధించిన పలువురు వ్యక్తులను, లావాదేవీలను ఈడీ పరిశీలిస్తోంది.

**గమనిక: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సమన్లు జారీ కావడం విచారణలో భాగం మాత్రమే. సమన్లు అందుకోవడం లేదా విచారణకు హాజరుకావడం ద్వారా ఆయనపై ఆరోపణలు రుజువైనట్లు అర్థం కాదు.**

# జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గణేష్ నిమజ్జనోత్సవం, అన్నదానం



నిర్మల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్టించిన శ్రీ గణపతి విగ్రహానికి శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ పూజలు పూర్తి చేసిన అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ నిమజ్జన శోభాయాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీసీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా విట్టల్ కాంబ్లే:

## మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఘన సన్మానం



ముధోల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా డీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ముధోల్ మండలం బోరేగాం గ్రామానికి చెందిన విట్టల్ కాంబ్లేను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విట్టల్ కాంబ్లే మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోని అర్హులైన పేదలందరికీ చేరేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్, ఎస్సీ విభాగం కార్యదర్శి గౌతమ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాపెవార్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ సాయిరాం, సర్పంచులు ఎజాజుద్దీన్, అరిఫుద్దీన్, దిగంబర్, కాంతారావు పాల్గొన్నారు.

# కౌట్ల (కె)లో వ్యవసాయ అధికారులకు ఘన సన్మానం: ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన




నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ రూరల్ మండలంలోని కౌట్ల (కె) గ్రామ పంచాయతీ కార్యాలయానికి తొలిసారిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారిణి (డీఏవో) సుజాత, మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈవో అంబాజీలను గ్రామ పంచాయతీ పాలకవర్గం శుక్రవారం శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అధికారులు రైతులతో సమావేశమై ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు, డిజిటల్ క్రాప్ సర్వే మరియు యూరియా బుకింగ్ విధానాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుమాల రాజు, ఉపసర్పంచ్ రఘు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి

నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): అమరవీరుడు భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కె. లక్ష్మి, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. రాజన్న పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్మల్ పట్టణంలోని భగత్ సింగ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, అసమానతల నిర్మూలన కోసం భగత్ సింగ్ చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. యువత మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ ఆలోచనలతో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగామణి, విజయ, రుక్మ, తైసిన్, గంగాధర్, శ్రీనివాస్, దత్తు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.




# శ్రీరాం గణేష్‌కు ఇంపాక్ట్ 'ట్రైన్ ది ట్రైనర్' సర్టిఫికెట్ ప్రదానం



నిర్మల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'ట్రైన్ ది ట్రైనర్' కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన నిర్మల్‌కు చెందిన శ్రీరాం గణేష్‌కు సంస్థ ఫౌండర్ డాక్టర్ గంపా నాగేశ్వరరావు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందజేశారు. నిర్మల్‌లో జరిగిన మెగా ఇంపాక్ట్ సదస్సులో రీజియన్-19 అధ్యక్షుడు వాడేకర్ లక్ష్మణ్ సమక్షంలో ఈ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాం గణేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతలో సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు 'ఇంటికొక వక్త.. ఊరికొక శిక్షకుడు' అనే లక్ష్యంతో పనిచేస్తానని తెలిపారు.

# బాసర గోదావరి నదిలో దూకిన మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు




బాసర, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను బాసర పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా రక్షించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లక్ష్మీ తండా (యాచారం)కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు జోరేసింగ్ భార్య జైత్రోత్ జ్యోతి కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం బాసర గోదావరి నదిలోకి దూకింది. ఘటనా స్థలంలో ఉన్న స్థానికులు వెంటనే బాసర పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన పోలీసు బృందం నది వద్దకు చేరుకుని నీటిలో మునిగిపోతున్న ఆమెను కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనంతరం బాసర పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్‌హెచ్‌వో దీపక్ ఆధ్వర్యంలో బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆపత్కాలంలో సమయస్ఫూర్తితో మహిళ ప్రాణాలు కాపాడిన బాసర పోలీసులను జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్ ఐపీఎస్ మరియు స్థానిక ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

# బాసర గోదావరి తీరంలో చివరి విడత నిమజ్జనాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు




బాసర, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పుణ్యక్షేత్రం సమీపంలోని గోదావరి నదీ తీరంలో అనంత చతుర్దశి చివరి విడత గణేష్ నిమజ్జనాల కోసం అధికార యంత్రాంగం భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్ మరియు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు బాసర గోదావరికి తరలివచ్చే అవకాశమున్నందున గోదావరి వంతెన పరిసరాల్లో భారీ క్రేన్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలు, బారికేడ్లను సిద్ధం చేశారు. భక్తుల భద్రత దృష్ట్యా నదిలో గజ ఈతగాళ్లతో కూడిన రెస్క్యూ బోట్లను నిరంతరం అందుబాటులో ఉంచారు. గోదావరి స్నాన ఘాట్ల వద్ద పోలీసు ఉన్నతాధికారులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# నిర్మల్‌లో 700 మంది పోలీసులతో గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

### 106 సీసీ కెమెరాలు, 4 డ్రోన్లతో గగనతల నిఘా.. 8 సెక్టార్లుగా విభజన




నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 700 మంది సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.
బుధవారపేటలోని ఎం.కె. ఫంక్షన్ హాల్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శుక్రవారం ఆమె దిశానిర్దేశం చేశారు. శోభాయాత్ర మార్గాలు, సమస్యాత్మక ప్రాంతాలు, మసీదులు, నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఉంచాలన్నారు. విధుల్లో ఒక అదనపు ఎస్పీ, ఒక ఏఎస్పీ, 15 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, ఎస్సైలు పాల్గొంటున్నారని వివరించారు. భద్రత కోసం పట్టణాన్ని 8 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక బలగాలను మోహరించడంతో పాటు 106 సీసీ కెమెరాలు, 4 డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావాలి

### లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
### విద్యార్థినులతో లెక్కలు చేయించి పెన్నులు బహుమతిగా అందజేత



సోన్/నిర్మల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాబోయే పదో తరగతి వార్షిక బోర్డు పరీక్షలకు విద్యార్థులంతా ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, కిచెన్ రూం, డార్మిటరీలను క్షుణ్ణంగా పరిశీలించి పారిశుద్ధ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు నిత్యం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి సిలబస్ పురోగతి, అందుతున్న విద్యాబోధనపై ఆరా తీశారు. తరగతి గదిలో బోర్డుపై స్వయంగా గణిత ప్రశ్నలు రాసి విద్యార్థినులతో సాధింపజేశారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులను ప్రశంసిస్తూ స్వయంగా పెన్నులను బహుమతిగా అందజేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) దర్శనం భోజన్న, తహశీల్దార్ సంతోష్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# తీర్పులు మారినా తీరు మారని నేతలు!

# ప్రజాస్వామ్యానికేం మిగిలింది?

### రాజకీయ 'ద్వంద్వ నీతి'.. ప్రజాస్వామ్యానికి చేటు!



ఖైరతాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు దానం నాగేందర్‌పై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన సంచలనాత్మక తీర్పు, తెలంగాణ రాజకీయ యవనికపై మరోసారి ఉప ఎన్నికల నగారాను మోగించింది. ఒక పార్టీ గుర్తుపై పోటీ చేసి గెలిచిన ప్రజాప్రతినిధి, ఆ నియోజకవర్గ ప్రజల తీర్పును తృణప్రాయంగా భావించి, అధికారంలోకి వచ్చిన వేరొక పార్టీ కండువా కప్పుకోవడంపై న్యాయస్థానం కఠినంగా స్పందించడాన్ని ప్రజాస్వామ్యవాదులు స్వాగతిస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా తగిన శాస్తి జరిగిందని విపక్షాలు హర్షం వ్యక్తం చేస్తూ "న్యాయం గెలిచింది" అని ప్రకటించుకుంటున్నాయి. అయితే, ఈ న్యాయపోరాటాలు, కోర్టు తీర్పులు, పార్టీల సవాళ్లు-ప్రతిసవాళ్ల ముసుగులో అసలు ప్రశ్న ఒకటి నలిగిపోతోంది. నిరంతరం ముంచుకొచ్చే ఈ అనవసర ఉప ఎన్నికల వల్ల సగటు పౌరుడికి, ఆ నియోజకవర్గ అభివృద్ధికి నిజంగా ఒరిగేదేమిటి? ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట సాగే ఈ రాజకీయ క్రీడ అంతిమంగా సామాన్య పన్ను చెల్లింపుదారుల సొత్తును, ప్రభుత్వ యంత్రాంగ సమయాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేస్తోందనేది పచ్చి నిజం.
ఒక పార్టీ గుర్తుపై, నిర్దిష్టమైన మేనిఫెస్టోను చూపి ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగి గెలిచిన ప్రజాప్రతినిధులు.. ఫలితాలు వచ్చిన కొద్దిరోజులకే నిరాటంకంగా అధికార పార్టీ వైపు దూకేయడం మన రాజకీయ వ్యవస్థలో ఒక నిత్యకృత్యంగా, అనివార్యమైన ఆచారంగా మారిపోయింది. గతంలో బిఆర్ఎస్ (అప్పటి టిఆర్ఎస్) అధికారంలో ఉన్న సమయంలో, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, టిడిపి తరఫున గెలిచిన పదుల సంఖ్యలోని ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి ఆహ్వానించి, విలీనం పేరిట గుర్తింపు ఇచ్చినప్పుడు లేని పట్టింపులు, నైతిక నీతులు ఇవాళ హఠాత్తుగా ప్రత్యక్షం కావడం విడ్డూరంగా ఉంది. అప్పట్లో బిఆర్ఎస్ చేసిన పనినే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరావృతం చేస్తూ విపక్ష ఎమ్మెల్యేలకు కండువాలు కప్పే సంస్కృతిని కొనసాగించింది. "మా వద్దకు ఎమ్మెల్యేలు వస్తే అది రాజకీయం.. మీ వద్దకు వస్తే నేరం, రాజ్యాంగ ఉల్లంఘన" అన్నట్లుగా సాగుతున్న ఈ డబుల్ స్టాండర్డ్స్ చూస్తుంటే, రాజకీయ పార్టీలకు సిద్ధాంతాలు, నైతిక విలువలు కేవలం మైకుల ముందు మాట్లాడే ప్రసంగాలకే పరిమితమని వేరే చెప్పనక్కర్లేదు.
ఇక్కడ గమనించాల్సిన మరో తీవ్రమైన అంశం ఏమిటంటే.. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (ఫిరాయింపు నిరోధక చట్టం) ఆంతర్యాన్ని దారుణంగా తుంగలో తొక్కడమే పనిగా పెట్టుకున్నాయి. జాతీయ స్థాయిలో స్వచ్ఛమైన రాజకీయం, రాజ్యాంగ పరిరక్షణ గురించి సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చే బిజెపి నాయకత్వం కూడా ఈ విషయంలో మినహాయింపేమీ కాదు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకొని, వ్యూహాత్మకంగా జిమ్మిక్కులు చేస్తూ ప్రభుత్వాలను కూల్చిన, ఏర్పరిచిన చరిత్ర నుండి బిజెపి తప్పించుకోలేదు. స్వతంత్రంగా అధికారం చేపట్టే బలం లేనప్పుడు ఇతర పార్టీలను చీల్చడం జాతీయ స్థాయిలో నిత్యకృత్యమైంది. అలాగే నేడు తెలంగాణలో కేసిఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు నైతికతల గురించి, న్యాయస్థానాల తీర్పుల గురించి పదే పదే మాట్లాడుతుంటే.. గత పదేళ్ల తమ పాలనా కాలంలో వారు ప్రతిపక్షాలను పూర్తిగా ఖాళీ చేయడానికి చేసిన ప్రయత్నాలు, విలీనాల పేరిట చేసిన రచ్చ ప్రజల మనోఫలకాలపై ఇంకా పదిలంగానే ఉన్నాయనే సత్యాన్ని వారు గుర్తుంచుకోవాలి.
ఈ రకమైన రాజకీయ వికృత క్రీడలో శాసనసభ స్పీకర్లు ఏళ్ల తరబడి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేసే ధోరణికి చెక్ పెడుతూ, రాజ్యాంగ పవిత్రతను కాపాడేందుకు న్యాయస్థానాలు కఠినమైన ఆదేశాలు ఇవ్వడం అత్యంత ఆహ్వానించదగిన పరిణామమే. కోర్టు గత ప్రభుత్వాల వైఖరిని లేదా ప్రస్తుత ప్రభుత్వాల వ్యూహాలను పక్కనబెట్టి, కేవలం రాజ్యాంగ చట్రానికి లోబడి తీర్పు ఇవ్వాల్సిన బాధ్యతను నెరవేర్చింది. కానీ, ఈ ప్రక్రియ వల్ల ప్రజాస్వామ్య మూలాలకే ప్రమాదం వాటిల్లుతోంది. ఓటు వేసి ఐదేళ్ల కాలానికి ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా అసెంబ్లీకి పంపితే, సదరు వ్యక్తి తన వ్యక్తిగత రాజకీయ స్వార్థాల కోసం, పదవుల వ్యామోహంతో, లేదా అధికార రక్షణ కోసం పార్టీలు మారిపోవడం ఎంతవరకు సమంజసం? ఆపై రాజీనామాలు చేయకుండా కోర్టుల చుట్టూ తిరుగుతూ, చివరికి అనర్హత వేటు పడ్డాక ఉప ఎన్నికలను ప్రజలపై రుద్దడం ఏ రకమైన న్యాయం?
ఉప ఎన్నికలు అంటే కేవలం ఒక రోజు ఓటింగ్ మాత్రమే కాదు. సుదీర్ఘ కాలం పాటు అమలులో ఉండే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) వల్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోతాయి. ప్రభుత్వ యంత్రాంగమంతా పరిపాలనను పక్కనబెట్టి ఎన్నికల విధుల్లో మునిగిపోతుంది. ప్రచారాల పేరిట కోట్లాది రూపాయల నల్లధనం నీళ్లలా ఖర్చు అవుతుంది. ఈ అనవసరమైన రాజకీయ విలాసానికి అయ్యే ఖర్చు, పరిపాలనా స్తబ్దత వల్ల కలిగే నష్టం అంతిమంగా సామాన్య పన్ను చెల్లింపుదారుడి నెత్తినే పడుతోంది.
కాబట్టి, ప్రజాస్వామ్యంలో రావాల్సిన నిజమైన మార్పు కేవలం న్యాయస్థానాల అనర్హత తీర్పులతోనో లేదా ఒకరిపై ఒకరు చేసుకునే రాజకీయ విమర్శలతోనో సాధ్యపడదు. పొలిటికల్ పార్టీల మూల వైఖరిలోనే సమూలమైన మార్పు రావలసి ఉంది. ఒకవేళ ఏ ప్రజాప్రతినిధికైనా తాను గెలిచిన పార్టీ సిద్ధాంతాలు నచ్చక, వేరే పార్టీలోకి మారాలనుకుంటే.. ప్రాథమికంగా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాతే కొత్త పార్టీ కండువా కప్పుకొని మళ్లీ ప్రజల తీర్పును కోరే నికార్సైన సంస్కృతి పెరగాలి. అలా కాకుండా, రాజ్యాంగ వ్యవస్థల్లోని సందుగొందులను వెతుక్కుంటూ పదవులను కాపాడుకునే ప్రయత్నం చేయడం, ఫిరాయింపుదారులను ప్రోత్సహించే అధికార పిపాసను ప్రదర్శించడం ఆగిపోవాలి.
తీర్పులు వచ్చినప్పుడల్లా "న్యాయం గెలిచింది" అని విపక్షాలు సంబరాలు చేసుకోవడం, "రాజకీయ కుట్ర" అని అధికార పక్షాలు సానుభూతి వ్యక్తంచేయడం వంటి నాటకాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులు చేసుకొని, తమ స్వార్థం కోసం నియోజకవర్గాలను, ప్రజలను ఉప ఎన్నికల రొంపిలోకి నెట్టే ఈ దురాచారానికి స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైంది. రాజ్యాంగాన్ని మభ్యపెట్టే నాయకులకు, పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలే తమ మహత్తరమైన ఓటు అనే ఆయుధంతో సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పి, గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# తెలుగు అధ్యాపకుడు ఎ. కపిల్‌కు విశిష్ట సాహిత్య పురస్కారాలు




ఉట్నూర్/నిర్మల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు, యువ కవి ఎ. కపిల్‌ను వరుస ప్రతిష్టాత్మక రాష్ట్ర, జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాలు వరించాయి. తెలుగు కళారత్నాలు సంస్థ, ఉషోదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఆయన రాసిన కవితకు ప్రథమ బహుమతితో పాటు 'గుర్రం జాషువా సేవా సౌరభం' బిరుదు లభించింది. అలాగే డాక్టర్ బోయి భీమన్న జయంతి పోటీలలో 'డాక్టర్ బోయి భీమన్న చైతన్య దీప్తి' బిరుదును దక్కించుకున్నారు. మరోవైపు గ్లోబల్లీ యునైటెడ్ టీచర్స్ (రా'+ఖు) సంస్థ నిర్వహించిన గురజాడ అప్పారావు జయంతి పోటీల్లోనూ ఆయన ప్రత్యేక ప్రశంసా పత్రం అందుకున్నారు. కపిల్ సాధించిన విజయాలపై కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సాయిప్రసాద్, తెలుగు విభాగాధిపతి ఎస్.కె. ముజీబ్ మరియు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# రబీంద్ర ఉన్నత పాఠశాలలో వందేమాతరం 150వ వార్షికోత్సవం

ముధోల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ పట్టణంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో జాతీయ గేయం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులంతా ఏకతాటిపై నిలిచి సంపూర్ణ వందేమాతరం గేయాన్ని భక్తిప్రపత్తులతో ఆలపించి దేశభక్తిని చాటారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ తన 'ఆనందమఠ్' నవలలో రాసిన ఈ గేయం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో లక్షలాది మంది వీరుల్లో స్ఫూర్తిని రగిలించిందన్నారు. నేటి యువత దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER

# రీ-సర్వేతోనే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

## న్యూ వెల్మల్‌లో 80 శాతం సర్వే పూర్తి.. రైతులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష

సోన్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర రీ-సర్వే ప్రక్రియతో ఏళ్ల తరబడి నెలకొన్న భూ సమస్యలు, సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శుక్రవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామ పంచాయతీ ప్రాంగణంలో రైతులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇప్పటికే 80 శాతం రీ-సర్వే పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, మిగిలిన భాగాన్ని అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే



సమయంలో రైతులు తమ పొలాల వద్ద ఉంటూ అధికారులకు సహకరించాలని సూచించారు. రైతులు సైతం స్పందిస్తూ తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతున్నందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ విఠల్, తహశీల్దార్ సంతోష్, సర్పంచ్ సాగర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

## కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

నిర్మల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు మరియు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో రంగంలోకి దిగాలన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ,



టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మండలాల వారీగా పంట విస్తీర్ణాన్ని బట్టి సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారిణి సుజాత, తూనికలు కొలతల అధికారి శంకర్, డీసీవో నర్సయ్య పాల్గొన్నారు.

# కంజర్ గ్రామంలో అంబేద్కర్ గణపతి వద్ద వైభవంగా కుంకుమార్చన పూజలు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల పరిధిలోని కంజర్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శు క్రవారం అంబేద్కర్ గణపతి మండపం ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజా మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో సంప్రదాయ వస్త్రధారణతో తరలివచ్చి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి, లలితా సహస్రనామ పారాయణలతో కుంకుమార్చనలు చేశారు. గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో,



సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి విస్తృత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమృత్ 2.0 రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలి

## నస్పూర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో ఈఎల్ఎస్ఆర్ నిర్మాణాల పరిశీలన.. ఎల్పీజీ డీలర్లతో సమీక్ష

మంచిర్యాల, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు నిరంతరం శుద్ధమైన తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఆదేశించారు. శుక్రవారం ఆయన నస్పూర్‌లోని ఆర్కే-6 వద్ద నిర్మిస్తున్న 1000 కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్), హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1500 కిలోలీటర్ల రిజర్వాయర్ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో



పరిశీలించారు. శ్రామిక బలాన్ని పెంచి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎల్పీజీ గ్యాస్ డీలర్లతో సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, వినియోగదారుల ఈ-కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# నిర్మల్ రూరల్ పరిధిలో అక్రమ మద్యంపై పోలీసుల ఉక్కుపాదం

## రూ. 4.32 లక్షల మద్యం స్వాధీనం

## ఐదు గ్రామాల్లో బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు.. ఐదుగురిపై కేసులు నమోదు

నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న అక్రమ మద్యం బెల్ట్ షాపులపై పోలీసులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లపల్లి, న్యూ పోచంపాడ్, కొండాపూర్, వేంగ్వాపేట్, రత్నాపూర్ కాండ్లీ గ్రామాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఎల్లపల్లిలో బొండ్ల నవీన్ వద్ద రూ. 93,620 విలువైన 202 లీటర్ల మద్యం, న్యూ పోచంపాడ్‌లో సంపంగి శివాయి కిరాణా దుకాణం నుంచి రూ. 27,330 విలువైన 58.3 లీటర్లు, కొండాపూర్‌లో అప్క గణేష్ బెల్ట్ షాప్ నుంచి రూ. 1,74,658 విలువైన 264.33 లీటర్లు, వేంగ్వాపేట్‌లో చింతల్ ముత్యం వద్ద రూ. 39,650 విలువైన 80.12 లీటర్లు, అలాగే రత్నాపూర్ కాండ్లీలో పుప్పాల అభిలాష్ బెల్ట్ షాప్ నుంచి రూ. 97,250 విలువైన 174.63 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 4,32,508 విలువైన 779



లీటర్ల మద్యాన్ని జప్తు చేసి నిందితులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వ చేసినా, బెల్ట్ షాపులు నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బెల్లంపల్లి, కాసిపేటలలో కలెక్టర్ కుమార్ దీపక్ విస్తృత పర్యటన

మంచిర్యాల, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మున్సిపాలిటీలు, మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలను కమిషనర్ రమేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్ సమక్షంలో తహశీల్దార్లతో సమావేశమై ఎస్ఐఆర్-2026 ఓటరు జాబితా హియరింగ్, భూముల రీ-సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై దిశానిర్దేశం చేశారు. తర్వాత కాసిపేట



మండలం రైతు వేదికలో జరుగుతున్న ఓటరు జాబితా హియరింగ్‌ను, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, మందుల నిల్వలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో భక్తాంజనేయ సాయి గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతి

బాసర, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాగలిని ఆయుధంగా ధరించి వ్యవసాయ విశిష్టతను లోకానికి చాటిన ఆదర్శమూర్తి బలరాముడని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న మండల పరిధిలోని ఉత్తమ రైతు దంపతులను ఘనంగా సత్కరించారు.



సన్మానం పొందిన వారిలో సుబేదార్ శివాజీ పటేల్, నాగేష్, పోతిగంటి విజయ్‌రావు, హల్ద గంగాధర్, గొరోళ్ల సాయినాథ్, గొరోళ్ల రాజేశ్వర్, సుబేదార్ రఘునాథ్ పటేల్, నానం నర్సయ్య ఉన్నారు. రైతు శ్రేయస్సే దేశ ప్రగతికి మూలమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# డీసీసీ ఎస్సీ విభాగం నూతన బాధ్యులకు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభినందనలు

ముధోల్, సెప్టెంబర్ 25 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన విట్టల్ కాంబ్లే, జిల్లా కార్యదర్శిగా నియమితులైన సూదుల గౌతమ్‌లను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి



అభినందనలు తెలుపుతూ ఎస్సీ విభాగం బలోపేతానికి, నిరుపేదల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, పోతన్న యాదవ్, సాపెవార్ కిష్టయ్య, వంశీకృష్ణ, సాయిరాం, సర్పంచులు ఎజాజుద్దీన్, అరిపుద్దీన్, దిగంబర్, కాంతారావు, నాయకులు రాంరెడ్డి, సాయినాథ్, శ్రీనివాస్ గౌడ్, రాజారెడ్డి పాల్గొన్నారు.